క్లుప్తంగా

పేద విద్యార్థికి ఆర్థికసాయం



జగ్గయ్యపేట అర్బన్: కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పేదలకు వస్త్రదానం, విద్య, వైద్య సహాయాన్ని అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు కర్లపాటి శ్రీనివాసరావు, ఆయన సోదరుడు రాజారావు కలిసి వారి మాతృమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇంజినీరింగ్ విద్యార్థికి రూ.5 వేలు, మరొకరికి రూ.5 వేలు, 30మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని హెచ్ఐవీ బాధిత పిల్లలకు రూ.10 వేల విలువైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్లపాటి రాజారావు, శ్రీదేవి, భారతి, రాయపూడి వెంకటేశ్వరరావు, శ్రేయస్సు సంస్థ సిబ్బంది రాజశేఖర్, విజయకుమారి, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో దీపోత్సవం



పెనుగంచిప్రోలు: పవిత్ర కార్తిక మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి మునేరు కాజ్‌వే పక్కన వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు. శ్రీఅయ్యప్ప దీక్షాస్వాములు స్వామివారి చిత్రపటం గీసి దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధి నివారణ



నందిగామటౌన్: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు సహకరించాలని ప్రాజెక్టు డైరెక్టర్ బాషా పిలుపునిచ్చారు. కృష్ణ వెన్నెల మహిళా సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ సెంటరులో ఆదివారం ఎయిడ్స్ అవగాహన దినాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ చేసి మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన కలిగిస్తూ మనోధైర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సుమన్, విద్యా సంస్థల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.జాహ్నవి ఆదివారం తెలిపారు. మండల ప్రజలు ఆయా సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు.



దివంగత సీఎం వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న అవినాష్, మల్లాది, డాక్టర్ జగన్‌మోహనరావు, తన్నీరు తదితరులు



పేటలో కార్యకర్తల సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అవినాష్, తన్నీరు, ఇంటూరి, మల్లాది, జగన్‌మోహనరావు



పేటలో బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

కూటమి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

దేవినేని అవినాష్

జగ్గయ్యపేటఅర్బన్: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వ పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. ఈ సర్కార్ అబద్ధాలు, మోసాలపై ప్రజలకు కోపం రెట్టింపైందని పేర్కొన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నాతో కలిసి ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పార్టీ నియోజవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగిస్తూ, ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఫోన్‌చేసి ఎవరు బెదిరించినా..మాతో రండి అని పిలిచినా భయపడవద్దన్నారు. మీ అందరికి మేము అండగా ఉంటామంటూ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. జగ్గయ్యపేటలో ఎవరు పార్టీలో ఉన్నా, వీడినా జగనన్నే మాకు ముఖ్యం అంటూ కార్యకర్తలు పార్టీకి కొండంత అండగా నిలవడం అభినందనీయమన్నారు. వరద బాధతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇటీవల జరిగిన డీఆర్సీ మీటింగ్‌లో టీడీపీ నాయకులే విమర్శలు చేయడం కూటమి ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను తెలియజేస్తోందని పేర్కొన్నారు. కరెంటు చార్జీలు పెంచబోమంటూ హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ట్రూఅప్ చార్జిల పేరుతో ప్రజలపై వేలాది కోట్ల భారం మోపారని విమర్శించారు.

విజయవాడ సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలంటూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను చంద్రబాబు పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మాట్లాడుతూ చేతకాని హామీలు ఇచ్చి వాటిని అమలు చేయక పోగా ప్రజల పక్షాన నిలుస్తున్నవారే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కేసుల పేరుతో భయపెట్టాలని చూస్తోందని ఎద్దేవా చేశారు. పోలీసు వ్యవస్థ కూడా ప్రభుత్వానికి చుట్టంగా మారడం శోచనీయమన్నారు.పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే కేశినేని చిన్ని, శ్రీరాం రాజగోపాల్ ప్రజాసమస్యలను గాలికి వదిలేసి అక్రమసంపాదనపై దృష్టిపెట్టారని విమర్శించారు. అందుకు నియోజకవర్గంలో సాగుతున్న ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణానే నిదర్శనమని గుర్తుచేశారు. నిత్యం వందలాది లారీల ఇసుకను తెలంగాణకు తరలిస్తూ కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారన్నారు. పట్టణంలోని రైతుబజారు అవినీతికి అడ్డాగా మారి అధికారపార్టీ నాయకులకు ఏటీఎంలా మారిందన్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తాను, పార్టీ అధినాయకత్వం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా) మాట్లాడుతూ నాయకులు పార్టీలు మారినప్పటికీ కార్యకర్తలు చెక్కు చెదరలేదని ఈ సభ నిరూపించిందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన పేట నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమని పేర్కొన్నారు. తొలుత పార్టీ శ్రేణులు పట్టణంలో భారీ ర్యాలీ చేశాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించారు. నెడ్‌కాప్ మాజీ చైర్మన్ వేల్పుల రవికుమార్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపతి విజిత, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, ఎంపీపీ మార్కపూడి గాంధీ, పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు జుబేర్, పార్టీ నాయకులు మండవ శ్రీనివాసగౌడ్, బద్దూనాయక్, నంబూరి రవి, పెంటి శ్రీనివాసరావు, చల్లా సుశీల, చింతకుంట్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ కాకాని స్రవంతి, చల్లా వైకుంఠరావు, మట్టా ప్రతాపరెడ్డి, బూడిద నరసింహారావు ఆయా గ్రామాల చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

అతివేగం అత్యంత ప్రమాదకరం: ఎస్ఐ



కంచికచర్లలో ఆటో, ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజు

కంచికచర్ల: ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడిపేవారు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ బోనగిరి రాజు సూచించారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్, పెట్రోలు బంక్ సెంటర్, గొట్టుముక్కల రోడ్డు సెంటర్, అంబేడ్కర్ సెంటర్లలో ఆదివారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. త్రిపుల్ రైడ్ చేసిన వాహనదారులు, లైసెన్స్ లేకుండా నడిపే వారిని, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపేవారిని గుర్తించి వారికి జరిమానా విధించి అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చారు. సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అతివేగం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలను నడిపితే విలువైన ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతాయన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఆటోవాలాలు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, వారికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా గమ్యానికి చేర్చాలన్నారు. లౌడ్ స్పీకర్లు ఆటోలో ఉంటే వాటిని తొలగించాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆరుగురికి రూ.3వేలు జరిమానా విధించారు.

వాహనాల తనిఖీ

వీరులపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే సహించేది లేదని ఎస్ఐ అనిల్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని జుజ్జూరు ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటోవాలాలు సైతం పరిమితి మేరకే ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనాలు సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రికార్డులు సరిగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు.

వాసవి వృద్ధాప్య పింఛన్ అందజేత

నందిగామ టౌన్: నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలను ఆదుకునేందుకు వాసవీ వృద్ధాప్య పింఛన్‌ను అందిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘ నాయకుడు పారేపల్లి సాయిబాబు తెలిపారు. పట్టణానికి చెందిన సముద్రాల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఆదివారం పదిమంది నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు ఒకొక్కరికి రూ. 500 చొప్పున పంపిణీ చేశారు. ప్రతినెలా పింఛన్‌ను అందిస్తున్నట్లు సాయిబాబు తెలిపారు.కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు

ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



పెనుగంచిప్రోలు:కార్తిక మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. పసుపుకొమ్ములతో అమ్మవారిని అలంకరించారు. మక్రిబోయిన హుస్సేన్, తిరుపతమ్మ దంపతులు అనంత్, త్రివేణి, అర్చకులు శేషగిరిరావుశర్మ, దేవి పసుపుకొమ్ములను అందించారు. భక్తులు అమ్మవారిని పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం అమ్మవారికి రథోత్సవం నిర్వహించారు.

నేడు హుండీ లెక్కింపు

నందిగామటౌన్: శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో సోమవారం హుండీ లెక్కింపు జరుగుతుందని ఈవో గంగాధర్ ఆదివారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు హుండీ కానుకలు లెక్కిస్తామని, మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్ ముక్కలకు వేలం పాట నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తిగల భక్తులు పాల్గొనాలని ఈవో కోరారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



నందిగామలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ సతీష్, పోలీసులు



జగ్గయ్యపేట ర్యాలీ చేస్తున్న ఏసీపీ, పోలీసులు

జగ్గయ్యపేట: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని నందిగామ ఏసీపీ తిలక్ సూచించారు. జగ్గయ్యపేట పట్టణంలో హెల్మెట్ వాడకంపై వాహనదారులతో కలిసి పోలీసులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది తలకు గాయాలై మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ వాడకం భారం కాదని ప్రాణాలకు రక్ష అని పేర్కొన్నారు. హెల్మెట్‌వాడకం భారం కాదని, ప్రయాణసమయంలో ప్రమాదాల బారిన పడినపుడు తలకు గాయాలు కాకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట, చిల్లకల్లు, పెనుగంచిప్రోలు, వత్సవాయి ఎస్ఐలు తోట సూర్య శ్రీనివాస్, రాజు, వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనచోదకులకు అవగాహన...

నందిగామటౌన్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాద సమయంలో ప్రాణహాని ముప్పు నుంచి బయటపడవచ్చని ట్రాఫిక్ సీఐ సతీష్ సూచించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెల్మెట్ వినియోగంపై పట్టణంలోని చందాపురం బైపాస్ రోడ్డులో వాహనదారులకు ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే ప్రమాద సమయంలో ప్రమాద తీవ్రత అధికంగా ఉంటుందన్నారు. మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేయటంతోపాటు తల్లిదండ్రులపై కూడా చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధనలు



పూజల్లో పాల్గొన్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్ మోహనరావు, కాపు సంఘీయులు, నాయకులు



మాట్లాడుతున్న మంత్రి కె.పార్థసారథి

నందిగామటౌన్: కార్తిక మాసంలో వన సమారాధనల ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక భావనలు పెంపొందుతాయని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరి సమీపంలోని మామిడితోటల్లో కాపు సామాజికవర్గ వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉసిరిచెట్టు కింద శ్రీహరికి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. చిన్నారులు, మహిళలు ప్రతిఒక్కరు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం దివంగత నేత వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ వన వన సమారాధనలలో ఉసిరి, తులసీ తదితర చెట్ల నుంచి వచ్చే గాలులు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తమైనవన్నారు. వన సమారాధనలతో ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలతోపాటు ప్రజల మధ్యన ఆత్మీయతానురాగాలు పెంపొంది సామాజిక సామరస్యతకు, సమైక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు పూజారి రాజేష్, కమిశెట్టి వెంకటేశ్వరరావు, పుప్పాల భరత్‌సాయి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పారుపల్లి హరిబాబు, వడ్డెల్లి శ్రీనివాసరావు, వీరబాబు, కాపు సంఘీయులు పాల్గొన్నారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి..

బలుసుపాడు(జగ్గయ్యపేట): మండలంలోని బలుసుపాడు మామిడితోటలో ఆదివారం నియోజకవర్గ స్థాయిలో యాదవుల కార్తిక వనసమారాధనను ఆ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ యాదవులంతా ఐక్యంగా ఉండాలన్నారు. అనంతరం శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగలరావుయాదవ్, యాదవ నాయకులు పచ్చిపాల నాగేశ్వరరావు, బోయిన ప్రసాద్, మేకల సాంబశివరావు, గుడారు పేరయ్య, గొట్టి నాగరాజు, అంజనేయులు పాల్గొన్నారు.

అన్నదాతపై బీమా భారం



కంచికచర్ల మండలంలో సాగవుతున్న మొక్కజొన్న (ఫైల్)

కంచికచర్ల: సార్వత్రిక ఎన్నికల ముందు రైతులకు మేలుచేస్తాం..వారికి అండగా ఉంటాం..అంటూ డప్పు కొట్టుకున్న కూటమి నాయకులు తీరా అధికారంలోకి రాగానే రైతులకు మొండిచేయి చూపించారు. అన్నదాతలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ఉచిత పంటల బీమాకు మంగళం పాడేశారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేయడంతోపాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి అండగా నిలిచింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పథకంపై చేతులెత్తేసింది. ఆయా పంటల బీమా ప్రీమియంను రైతులే చెల్లించుకోవాలంటూ నిబంధన పెట్టింది. దీంతో పంటలసాగు ఖర్చులకే అప్పులు చేస్తున్న తాము ఈ బీమా ప్రీమియం ఎలా చెల్లించాలంటూ సన్న, చిన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతకు కొరవడిన ఆర్థికసాయం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటివరకు ఉన్న రైతుభరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ పథకంగా పేరు మార్చింది. అయితే ఖరీఫ్‌లో రైతులకు అందించాల్సిన పెట్టుబడి సాయాన్ని మాత్రం మరిచింది. రైతుభరోసా కింద గతంలో రైతులకు ఏటా రూ.13వేలు అందగా, ఈసారి రబీ ప్రారంభమవుతున్నా ఈ పథకం అమలు అతీగతీ లేకపోవడంపై రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.

బీమా చెల్లింపు రైతులకు భారమే..

తుఫాన్, భారీవర్షాలతో పంట నష్టం జరిగినప్పుడు పరిహారం పొందేందుకు రైతులకు పంటల బీమా పథకం ఎంతో దోహదపడుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2019 అక్టోబర్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. ఈ క్రాప్ చేసుకున్న రైతులందరికీ ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి ఆదుకుంది. దీంతో బీమా మొత్తాన్ని చెల్లించే పనిలేకుండా చేసింది. విపత్తుల సమయంలో పంట నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందింది. కాని ఈ ఏడాది పంటల బీమా ప్రీమియంను రైతులే చెల్లించుకోవాలని ప్రభుత్వం చెబుతుండటం పెద్ద శరాఘాతమేనని రైతులు వాపోతున్నారు.

రబీ సాగు అంచనా 7,664 హెక్టార్లు..

నందిగామ నియోజకవర్గంలో రైతులు రబీ సీజన్‌లో వరి, జొన్న, మొక్కజొన్న, పెసర, కందిపంట, చెరకు, నువ్వులు, మినుము, తదితర పంటలను సుమారు 7664 హెక్టార్లలో సాగు చేయనున్నటుల వ్యవసాయాధికారులు అంచనా.

కంచికచర్ల మండలంలో 3,476 హెక్టార్లు, నందిగామ మండలంలో 1,749 హెక్టార్లు, వీరులపాడు మండలంలో 1,493 హెక్టార్లు, చందర్లపాడు మండలంలో 398 హెక్టార్లలో పంటలు సాగు చేయనున్నారు. ఈక్రమంలో పంటల బీమా పథకం కింద రైతులే డిసెంబర్ 15వతేదీలోగా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం పేర్కొనడం తమకు తీరనినష్టమని రైతులు వాపోతున్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపు నుంచి ప్రభుత్వం వైదొలగి ఆభారాన్ని రైతులపై మోపడేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదేనా రైతుప్రభుత్వం అంటే అంటూ మండిపడుతున్నారు.ఇప్పటికే ఖరీఫ్ సమయంలో సంభవించిన వరదలకు పంటలు దెబ్బతిని, దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోయి ఉన్న తమపై ఈ ప్రీమియం భారం మోపడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం పునరాలోచన చేసి గతంలో మాదిరిగానే రైతుల తరపున పంటల బీమా పథకం కోసం రైతుల తరపున ప్రీమియం చెల్లించాలని నందిగామ నియోజకవర్గంలోని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పంట పేరు	చెల్లించాల్సిన ప్రీమియం ఎకరాకు
వరి	రూ.630
మినుము	రూ.285
పెసర	రూ.270
నువ్వులు	రూ.180
వేరు శెనగ	రూ.480
టమాటా	రూ.1500
జొన్న	రూ.297

రైతులే ప్రీమియం చెల్లించాలి..



పంటల బీమా పథకం వర్తించాలంటే రైతులే ప్రీమియం చెల్లించాలి. ఈ మేరకు ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ప్రక్రియ రైతులకు అలవాటు అయితే క్రమం తప్పకుండా చెల్లిస్తారు. తద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు దెబ్బతిన్నా పరిహారం పొందే వీలుంటుంది. నిర్దేశించిన గడువులోగా ప్రతి రైతూ ప్రీమియం చెల్లిస్తే బీమా వర్తిస్తుంది.

- కె.విజయకుమార్, మండల వ్యవసాయాధికారి, కంచికచర్ల

పంటల బీమా రద్దు అన్యాయం..



ఉచిత పంటల బీమా పథకం రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే రైతులను దెబ్బతీస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందటం లేదు. పంటలకు ఉచిత పంటల బీమాను వర్తింపజేయాలి. బీమా లేకపోతే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు దెబ్బతింటే నష్టపరిహారం అందదు. అప్పులు చేస్తే తప్ప పంటల సాగు చేయలేని దుస్థితి రైతులది. పంటల బీమా ప్రీమియం కూడా చెల్లించాలంటే అది మరింత భారమవుతోంది.

- కోదాటి రామకృష్ణ, రైతు, ఎస్.అమరవరం, కంచికచర్ల మండలం

రైతులపై భారం మోపడం తగదు..



గతంలో అమలు చేసిన ఉచిత బీమా పథకాన్ని కొనసాగించాలి. కూటమి ప్రభుత్వ ం రైతులపై భారం మోపడం సమంజసం కాదు. పంటల బీమాకు సంబంధించిన ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలి. వ్యవసాయం సాగుచేసేందుకు పెట్టుబడులకే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా ప్రీమియం చెల్లించాలనడం అన్యాయం. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలి.

- మార్కపూడి ఏసుపాదం, రైతు, గండేపల్లి, కంచికచర్ల మండలం

చిరుజల్లులతో రైతుల్లో ఆందోళన



అనుమంచిపల్లిలో కల్లంలో ఆరబోసిన ధాన్యంపై కప్పిన పట్టాలు

జగ్గయ్యపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం సాయంత్రం కురిసిన చిరు జల్లులకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం సమయంలో ఎండగా ఉన్నప్పటికీ వాతావరణంలో మార్పుల కారణంగా ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై జల్లుల పడుతుండటంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. ముఖ్యంగా వరి కోతలు కోసి ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసిన రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలలో ఆదివారం సాయంత్రం చిరుజల్లులు కురవడంతో ధాన్యం కల్లాల్లో ఆరబెట్టిన రైతులు పంటను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. కొందరు రైతులు చేతికొచ్చిన పంట నీటిపాలవుతుందోనమోనని భయాందోళనకు గురయ్యారు. అనుమంచిపల్లి, తక్కెళ్లపాడు, పెనుగంచిప్రోలు, వత్సవాయి తదితర గ్రామాల్లో కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులు పట్టాలు పట్టుకుని ఉరుకులు పరుగులు పెట్టారు.